భారత రాజకీయ వ్యవస్థ

భారత్ ఒక దేశంగా ఎప్పటినుంచో కొనసాగుతోంది భారతీయులంతా ఒకేజాతి అనే భావన బ్రిటిష్ వారి పాల న కాలంలో బాగా నాటుకు పోయింది. ఆధునిక కాలంలో ప్రతి దేశానికి ఒక రాజ్యాంగం ఉంది. పాలకుల, పాలితుల మధ్య సంబంధాన్ని క్రమబద్ధం చేసే నియమనిబంధనల సంపుటే రాజ్యాంగం! భారత రాజ్యాంగం లిఖిత రాజ్యాంగం.



భారత్‌కు వచ్చిన ముగ్గురు బ్రిటన్ కేబినెట్‌మంత్రులు భారత జాతీ య కాంగ్రెస్, ఇండియన్ ముస్లింలీగ్‌లను కలిశారు. అవిభక్త భారతదే శానికి అధికార బదిలీ జరగాలని కాంగ్రెస్ పట్టుబడితే... 'ద్విజాతి' సిద్ధాంత ప్రాతిపదికన భారత ఉపఖండాన్ని ఇండియా, పాకిస్థాన్ అనే రెండు డొమినియన్‌లుగా విభజించాలని ముస్లింలీగ్ పట్టుపట్టింది. రాజీ సూత్రంగా, ప్రస్తుతానికి భారత్‌ను విభజించే ప్రసక్తి లేదని, పదేళ్ల తర్వాత అవసరమైతే విభజించవచ్చని మంత్రిత్రయ సంఘం సూచించింది. రాజ్యాంగ పరిషత్‌కు పరోక్షంగా ఎన్నికలు జరిగేలా, స్వదేశ సంస్థానాలు రాజ్యాంగ రూపకల్పనలో పాలుపంచుకునేలా నిర్ణయించింది. ఎన్నికల్లో ముస్లింలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ముస్లింలీగ్... మిగతా ప్రాంతాల్లో కాంగ్రెస్, ఇతర రాజకీయ పక్షాలు గెలిచాయి.

రాజ్యాంగ పరిషత్:

సచ్చిదానంద సిన్హా రాజ్యాంగ పరిషత్‌కు తాత్కాలిక అధ్యక్షునిగా వ్యవ హరిస్తే... 1946 డిసెంబరు 11న రాజేంద్రప్రసాద్ శాశ్వత అధ్యక్షునిగా ఎంపికయ్యారు. 389 మందితో కూడిన ఈ రాజ్యాంగ పరిషత్ ప్రథమ సమావేశం 1946 డిసెంబరు 9న జరిగింది. ముస్లింలీగ్ ప్రతినిధులు దీన్ని బహిష్కరించారు. దాంతో 207 మంది మాత్రమే సమావేశానికి హాజరయ్యారు. మౌంట్ బాటన్ ప్రణాళిక(3.6.1947) మేరకు పాకిస్థా న్‌కు ప్రత్యేక రాజ్యాంగ పరిషత్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పాకిస్థాన్ పరిధిలోకి వచ్చిన ప్రాంతాల పరిషత్ సభ్యులు అవిభక్త పరి షత్‌లో సభ్యత్వాన్ని కోల్పోయారు. ఫలితంగా భారత రాజ్యాంగ పరి షత్ సభ్యుల సంఖ్య 299కు తగ్గింది. 1946 డిసెంబరు 13న జవహర్ లాల్ నెహ్రూ ప్రవేశపెట్టిన ''లక్ష్యాల తీర్మానం''... 1947 జనవరి 22న ఏకగ్రీవంగా ఆమోదం పొందింది. ఈ తీర్మానమే రాజ్యాంగ పీఠిక.

రాజ్యాంగ ముసాయిదా:

1947 డిసెంబర్ 14 అర్ధరాత్రి సమావేశమైన రాజ్యాంగ పరిషత్... స్వతంత్ర భారత శాసన సభా బాధ్యతలను కూడా స్వీకరించింది. బి.ఆర్.అంబేద్కర్ అధ్యక్షతనఏర్పడిన రచనా కమిటీ (26-8-1947) ముసాయిదా (డ్రాఫ్ట్) రాజ్యాంగాన్ని రూపొందించింది. బి.యన్.రావ్ రాజ్యాంగ సలహాదారుగా, యస్.యన్.ముఖర్జీ ప్రధాన లేఖకునిగా విశేష సేవలందించారు. రాజ్యాంగపరిషత్ ముసాయిదా రాజ్యాం గాన్ని చర్చించి.. 2,473 సవరణలను పరిశీలించి, 1949 నవంబరు 26న ఆమోదించింది. 284 మంది సభ్యులు 1950 జనవరి 24న రాజ్యాంగ అసలు ప్రతి పై సంతకాలు చేశారు. 1950 జనవరి 26న రాజ్యాంగ పరిషత్ తాత్కాలిక పార్లమెంటుగా మారింది. రాజ్యాంగ పరిషత్ మొత్తం 11 సమావేశాలు జరిపింది. 2 ఏళ్ల 11 నెలల 17 రోజులపాటు కొనసాగింది. సమావేశమైన 165 రోజుల్లో 114 రోజులు ముసాయిదా రాజ్యాంగం పరిశీలన జరిగింది. పరిషత్ విధి నిర్వహణ లో తోడ్పడిన ప్రధానమైన కమిటీలకు ప్రముఖులు అధ్యక్షులుగా వ్యవ హరించారు. వీటిలో స్టీరింగ్ కమిటీ, సభా కమిటీ, ప్రాథమిక హక్కుల ఉపకమిటీ, అల్ప సంఖ్యాక వర్గాల ఉపకమిటీ ముఖ్యమైనవి.

రాజ్యం.. జాతి:

భారతదేశం, దాని ప్రజలు, సంస్కృతి, చరిత్ర, పురాతనమైనప్పటికీ.. ఆధునిక పరిభాషలో వాడే 'రాజ్యం' అనే పదానికి కొత్త. మనం తరచు గా దేశం, జాతి, రాజ్యం అనే భావనలను ఒకే అర్థం వచ్చేలా వాడు తుంటాం. 'దేశం' అనే పదం భౌగోళిక స్వభావాన్ని స్ఫురింపజే స్తే... 'జాతి' ప్రజల మధ్య భావోద్వేగ ఐక్యతను తెలియజేస్తుంది ; 'రాజ్యం' మానవ సముదాయ రాజకీయ స్వాతంత్ర్య స్థితిని తెలియజేస్తుంది. ఇండియా ఒక 'దేశం'గా ఎప్పటినుంచో కొనసాగుతోంది. భారతీయు లంతా ఒకే 'జాతి' అనే భావం బ్రిటిష్‌వారి పాలనలో బాగా నాటుకు పోయింది. అది ఉద్యమంగా పరిణమించి 'భారతరాజ్య' అవతరణకు దారితీసింది. 1947 ఆగస్టు 14 వరకు భారతదేశం, భారతజాతి అనే రెండు భావాలు భారత ఉపఖండానికి వర్తిస్తే... 1947 ఆగస్టు 15 నుంచి భారతదేశానికి, భారతజాతికి 'రాజ్యం' అనే హోదా లభిం చింది. ప్రస్తుతం మనం భారతదేశానికి చెంది, ఆ జాతి ప్రజలుగా గుర్తింపుపొందుతూ... ఒక స్వతంత్ర రాజకీయ వ్యవస్థ (రాజ్యం)గా కొనసాగుతున్నాం. నిర్దిష్ట భూభాగంలో నివసిస్తూ, వారి జీవితాన్ని క్రమబద్ధం చేయడానికి ప్రభుత్వాన్ని ఏర్పరచుకొని, బహిర్గత విషయా

లలో స్వాధీనతను అను భవించే మానవ సముదాయమే 'రాజ్యం'.

రాజ్యాంగం అంటే..!!

'రాజ్య లక్ష్యాలను, స్వభావాన్ని తెలియజేస్తూ... వాటిని కార్యరూపం లోకి తేవడానికి ఏర్పాటు చేసిన శాసన, కార్యనిర్వాహక, న్యాయశాఖల వ్యవస్థీకరణ, అధికారాలను తెలియజేస్తూ.. పౌరుల హక్కులను, బాధ్యతలను వివరించే నిబంధనల సంపుటి'. 1950 జనవరి 26 నుంచి అమలులోకి వచ్చిన రాజ్యాంగం దేశానికంతటికి అత్యున్నత శాసనం. దేశ సరిహద్దుల్లో నివసించే ప్రజలు, కొనసాగే వ్యవస్థలు దీని నిబంధనల మేరకు కొనసాగుతాయి. ప్రతి రాజ్యాంగానికి కొంత ప్రత్యేకత ఉంటుంది. రాజ్యాంగ రచన చేసినప్పుడు మన నాయకులు వివిధ దేశాల రాజ్యాంగాలను అధ్యయనం చేసి.. మన దేశ భూత, వర్తమాన, భవిష్యత్తులను దృష్టిలో పెట్టుకొని సుదీర్ఘమైన రాజ్యాంగాన్ని రూపొందించారు. 395 ప్రకరణలు, 8 షెడ్యూళ్ళతో అత్యున్నత న్యాయశాసనం... గత 58 ఏళ్లలో అనేక మార్పులకు గురైంది. 'ప్రకరణ' నిబంధనల సంపుటి అయితే, 'షెడ్యూలు' వాటి వివరణ. అయితే, అన్ని ప్రకరణలకు షెడ్యూళ్ళు లేవు.

పార్లమెంటరీ తరహా:

భారత రాజ్యాంగానికి 1935 భారత ప్రభుత్వ చట్టం మూలాధారం. 'భారత రాజ్యాంగం, 1935 భారత ప్రభుత్వ చట్టం నఖలు' అని విమర్శకులు వ్యాఖ్యానించటం అతిశయోక్తిగా అనిపించినా... కొంత వాస్తవం లేకపోలేదు. పార్లమెంటరీ తరహా ప్రభుత్వం.. అర్ధ సమాఖ్య.. కేంద్ర-రాష్ట్రాల మధ్య అధికార విభజన.. తదితర అంశాలు ఆ చట్టంనుంచి తీసుకున్నారు. రాజ్యాంగ పరిషత్‌లో కొందరు సభ్యులు అధ్యక్ష తరహా వ్యవస్థ వైపునకు మొగ్గినా... చివరికి పార్లమెంటరీ తరహా ప్రభుత్వాన్నే అంగీకరించారు.

అమెరికా నుంచి ప్రాథమిక హక్కులు:

రిపబ్లిక్, ప్రాథమిక హక్కులు, స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన న్యాయవ్యవస్థ, సమాఖ్య వ్యవస్థ వంటి అంశాలను అమెరికా రాజ్యాంగం నుంచి గ్రహిస్తే..ఆదేశిక సూత్రాలను ఐరిష్ రాజ్యాంగం నుంచి తీసుకున్నారు. అవశేషాధికారాలపై చట్టాలు చేసే అధికారం పార్లమెంటుకు ఉండటాన్ని కెనడా రాజ్యాంగం నుంచి గ్రహించారు. అత్యవసరాధికారాలను జర్మనీ నుంచి, రాజ్యాంగ సవరణ విధానాన్ని దక్షిణాఫ్రికానుంచి స్వీకరించారు. ఏడో షెడ్యూల్‌లో పొందుపరచిన ఉమ్మడి జాబితా భావనను ఆస్ట్రేలియా నుంచి, 42వ రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చిన ప్రాథమిక విధులు సోవియట్ యూనియన్ నుంచి తీసుకున్నారు. అంబేద్కర్ అభిప్రాయపడినట్లు మంచిని ఇతరుల నుంచి నేర్చుకోవటంలో తప్పేమీ లేదు. అంత మాత్రాన భారత రాజ్యాంగంలో స్వతఃసిద్ధ భావాలు ప్రస్ఫుటించలేదని కాదు. ఏకీకృత న్యాయవ్యవస్థ, ప్రభుత్వ సర్వీసుల గురించి రాజ్యాంగంలో ప్రస్తావన, ఎన్నికల సంఘం, ఆర్థిక సంఘం, కంప్ట్రోలర్, ఆడిటర్ జనరల్ లాంటి వ్యవస్థలకు రాజ్యాంగ పరమైన రక్షణ, షెడ్యూల్డ్ కులాలు, తెగలు, అల్పసంఖ్యాక వర్గాలకు రక్షణ, ఏక పౌరసత్వం మొదలైన అంశాలు మన రాజ్యాంగ మౌలికతను తెలుపుతాయి.

అతి పెద్ద రాజ్యాంగం:

భారత రాజ్యాంగం లిఖిత రాజ్యాంగం. పరిమాణంలో అతి పెద్దది. సవరణ విషయంలో సరళ, దృఢ సమ్మేళనమైంది. పార్లమెంటరీ తరహా ప్రభుత్వం, న్యాయ సమీక్షాధికారం, వ్యక్తిగత స్వేచ్ఛను పరిరక్షించటానికి ప్రాథమిక హక్కులు, సామాజిక సంక్షేమానికి ఆదేశిక సూత్రాలు, లౌకిక స్వభావం, ఏకపౌరసత్వం, రిపబ్లిక్ వ్యవస్థ, అర్ధ సమాఖ్య తదితర ప్రత్యేక లక్షణాలు ఉన్నాయి!!